క్లుప్తంగా

భూభారతితో సమస్యలు పరిష్కారం

ఆర్డీఓ అశోక్ చక్రవర్తి



సదస్సు నిర్వహిస్తున్న ఆర్డీఓ

కల్హేర్(నారాయణఖేడ్): భూ భారతి సదస్సులతో సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆర్డీఓ అశోక్ చక్రవర్తి తెలిపారు. మంగళవారం మండలంలోని బీబీపేట్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఆర్ఐ మల్లేశం, సిబ్బంది రవి, లక్ష్మణ్, డేవిడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని రాజోల, మెటల్‌కుంట, కల్బేమల్, మామిడ్గి గ్రామాల్లో మంగళవారం అధ్యాపకులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లిన ప్రభుత్వ కళాశాలల్లో బోధిస్తున్న బోధన, కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. మంచి విద్యతో పాటు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తోందని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అర్జున్, యాదగిరి, జగదీశ్, కవిరాజు, బాల్‌రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

గృహ నిర్మాణ శాఖ పీడీ చలపతిరావు



భూమి పూజ చేస్తున్న పీడీ చలపతిరావు

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ చలపతిరావు తెలిపారు. మంగళవారం కల్హేర్‌లో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. ఇళ్లు నిర్మించుకున్న వెంటనే లబ్ధిదారులకు బిల్లులు చెల్లించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ బాబు, ఎంపీఓ శ్రీనివాస్, ఎఈ సతీష్, పంచాయతీ సెక్రటరీ కృష్ణాచారి పాల్గొన్నారు.

న్యాయసేవలు అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్



ఆహారాన్ని పరిశీలిస్తున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: ఖైదీలకు న్యాయపరమైన సేవలు అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. మంగళవారం కందిలోని సెంట్రల్ జైల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖైదీలకు కావాల్సిన సదుపాయాలు, సరైన సమయానికి మూలఖాత్‌లు కల్పించాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారికి అందించే సేవల గురించి తెలుసుకున్నారు.

వెటర్నరీ సర్జన్‌పై విచారణ

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలో పశువైద్యాధికారి డాక్టర్ ముస్తాక్ అలీ రైతులకు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు అందింది. ఈమేరకు మంగళవారం కంగ్టిలో జిల్లా వెటర్నరీ అధికారి శ్రీనివాస్ శెట్టి విచారణ చేపట్టారు. మే 27న కంగ్టికి చెందిన రైతులు, పశుకాపరులుజిల్లా కేంద్రంలో జిల్లా వెటర్నరీ అధికారికి ఫిర్యాదు చే శారు. పశువైద్య శాఖ డైరెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేయడంతో జిల్లా పశువైద్యాధికారికి విచారణ చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు విచారణ చేసి నివేదికను డైరెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. పైఅధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నారాయణఖేడ్: మండలంలోని జగన్నాథ్‌పూర్ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద 8,100 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

● ప్రమాదకరంగా డ్రైనేజీ

జిల్లా పరిధి కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారి పక్కన మురుగు కాలువపై నిర్మించిన ఫుట్‌పాత్ ధ్వంసమైంది. అక్కడక్కడ ఇనుప చువ్వలు తేలాయి. ప్రయాణికులు చీకట్లో ఫుట్‌పాత్‌పై నడుస్తూ కాలువలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో నీళ్లు నిలిచి గుంతలు కనిపించవు. దీంతో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి





మల్కాపూర్ చౌరస్తా వద్ద డ్రైనేజీ దుస్థితి

గణేష్‌గడ్డ దేవస్థానంలో భక్తుల సందడి

గణేష్ గడ్డ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ మాట్లాడుతూ.. స్వామివారి దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశామన్నారు.

– పటాన్‌చెరు టౌన్



గణనాథుడికి ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

- 12నుంచి 16వరకు బడిబాట
- జిల్లాలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు
- అందులో 9,952 మంది చిన్నారులు



చిన్నారులను ఆడిస్తున్న టీచర్ విజయలక్ష్మి(ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంతో పాటు గ్రామీణస్థాయిలో విద్యను పటిష్ఠం చేసేందుకు ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్యపై విస్తృతస్థాయిలో అవగాహన కలిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రెండున్నరేళ్ల వయసు నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ఆకర్షితులయ్యేలా ప్రతి అంశంలోనూ మెరుగుపడనున్నాయి. ఓవైపు కేంద్రాలను కొత్త విధానంలోకి తీసుకురావడంతో పాటు, మరోవైపు బలోపేతం చేసేందుకు ఈనెల 12 గురువారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రోజూవారీ నిర్వహించే కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీనిలోభాగంగా బోధించే విద్య, అందించే సేవల గురించి టీచర్లు.. పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తారు. కొత్తగా చేరబోయే పిల్లలకు 16న సామూహిక అక్షరాభ్యాసాలు చేయించనున్నారు. ఐదేళ్లు పూర్తయి అంగన్‌వాడీ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు 'ప్రీ స్కూల్ సర్టిఫికెట్'ను ప్రదానం చేయనున్నారు.

షెడ్యూల్ ఇలా..

12న: గ్రామాల్లోని యువత, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలు నిర్వహించనున్నారు. రెండున్నరేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సంబంధిత సిబ్బంది కోరుతారు.

13న: అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రెండున్నరేళ్ల వయసు దాటిన పిల్లలను గుర్తిస్తారు. ఐదేళ్లు పూర్తయ్యి అంగన్‌వాడీ కేంద్రం విడిచి ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీకేంద్రాల్లో చేర్పిస్తారు. బోధన, పాఠశాల విద్యకు సమాయత్తం చేయడం తదితర అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

14న: స్వచ్ఛ అంగన్‌వాడీ కింద కేంద్రాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతారు. ప్రాంగణం చుట్టూ మొక్కలు నాటుతారు. తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం, కిచెన్ గార్డెన్ సదుపాయాలను కల్పిస్తారు.జూన్ లో బోధించబోయే,నిర్వహించే కార్యక్రమాలను వెల్లడిస్తారు.

16న: అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా చేరిన పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నాయనమ్మ, అమ్మమ్మలను ముఖ్యఅతిథులుగా పిలిచి బోధనా విధానం, పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తారు. పిల్లలను రోజూ అంగన్‌వాడీకి పంపుతున్న తల్లిదండ్రులకు బహుమతులు అందించనున్నారు.

> **అవగాహన కల్పిస్తాం**
>
> రెండున్నరేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసమే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పేదల పిల్లలకు కూడా ప్రైవేటు తరహాలోనే ప్రీస్కూల్ విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలను మరింతగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.
>
> – లలిత కుమారి, జిల్లా సంక్షేమాధికారి

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సు రద్దు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: ఫర్టిలైజర్ల దుకాణాల్లో డీలర్లు విత్తన, ఎరువులు, పురుగుమందుల చట్టాలకు లోబడి నాణ్యమైన విత్తనాలు అమ్మాలని, నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ నూనె గింజల పథకం కింద సోయాబీన్ 2500 ఎకరాల్లో మొగడంపల్లి, కోహీర్, నారాయణఖేడ్, కంగ్టి మండలాల్లో అమలు చేయుటకు జిల్లా స్థాయి కమిటీలో తీర్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల నివారణకు జిల్లా, డివిజన్, మండలస్థాయిలో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతిరోజు వివిధ డీలర్ దుకాణాలను తనిఖీ చేసి, ఎక్కడైన నకిలీ విత్తనాలు అమ్మినట్లు గుర్తిస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరతను సృష్టించవద్దని డీలర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు అమలు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సంగారెడ్డి: మున్సిపల్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే విధులు బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి హెచ్చరించారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 11వ పీఆర్సీ చైర్మన్ సిఫారసు చేసినా కనీస వేతనాలుగా నిర్ణయించడం లేదని వాపోయారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ. 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. పారిశుద్ధ్యం, వీధిదీపాలు, పార్కుల నిర్వహణ, నర్సరీలు, డంపింగ్ యార్డులు, డ్రైనేజీ క్లీనింగ్, తదితర పనులు మున్సిపల్ కార్మికులు సమాజ హితం కోరి తరతరాలుగా చేస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు లాంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, రాజు వేణు, లక్ష్మణ్, శివ, యాదగిరి, నర్సింలు, రాజేష్ నరసమ్మ, సునీత, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలదే భవిష్యత్తు

సీనియర్ శాస్త్రవేత్త సేవ నాయక్



రైతులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త సేవ నాయక్

జహీరాబాద్: రానున్న రోజుల్లో చిరుధాన్యాలకే మంచి డిమాండ్ ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే వాటిని సాగు చేసి లబ్ధి పొందాలని హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ సీనియర్ శాస్త్రవేత్త సేవ నాయక్ సూచించారు. జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శ్రేణి'కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో చిరుధాన్యాల ఆహారం అవసరం ఎక్కువగా ఉంటుందని, సాగు సైతం పెరుగుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు చిరుధాన్యాలు కొంత మేరకైనా తమ భూముల్లో సాగు చేసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల సాగును పెంచి, దానికి అవసరమైన విలువల జోడింపునకు సంబంధించిన యంత్రానికి సైతం తమ సంస్థ నుంచి సహాయం అందిస్తామని వివరించారు. ఆన్‌లైన్‌లో కలర్ చార్టు ద్వారా రంగును బట్టి ఎరువుల పోషక లోపాలను తెలుసుకుని, దానికి తగ్గట్టుగా ఎరువులు వాడాలని సూచించారు. జొన్న, సజ్జ, రాగులు, కర్ర పంటలో మేలైన జాతులు, చిరు ధాన్యాల సాగు పద్ధతులు, విలువల జోడింపు విషయమై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త సాయి ప్రియాంక పీఎం కిసాన్, రైతు బరోసా, పీఎం ఫసల్ బీమా యోజన, వ్యవసాయ పరికరాల సబ్సిడీల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త ఎన్.స్నేహలత, పశువైద్య శాస్త్రవేత్త కైలాష్, భూసార నిపుణుడు స్వామి,ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మండలం పరిధి పోతన్‌పల్లి (ఆర్) గ్రామానికి చెందిన నాయకుడు బాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి బాలయ్యను పరామర్శించి ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.1.50లక్షల ఎల్‌ఓసీ ఉత్తర్వులను బాలయ్య కుటుంబీకులకు అందజేశారు.

మాబడిలోనే చేర్పించండి



బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ

కంగ్టి(నారాయణఖేడ్): పిల్లలను ప్రభుత్వ బడికే పంపించాలని కంగ్టి మండలం తడ్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జమ్గి(బీ)లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ దుర్గారెడ్డి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. నాణ్యత విద్య ప్రభుత్వ బడుల్లోనే అందుతుందని తెలిపారు.

మెరుగైన సేవలే లక్ష్యం

ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ విజయభాస్కర్



నారాయణఖేడ్: కార్మికులతో మాట్లాడుతున్న విజయభాస్కర్



మొక్కలు నాటుతున్న ఆర్ఎం విజయభాస్కర్

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ అధికారులు, కార్మికులు పని చేయాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆర్టీసీ డిపోను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడుతూ.. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు చెప్పాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చాక ప్రయాణికులతో బస్సులు నిండుగా రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడం తగ్గిందన్నారు. సేవలను మరింత మెరుగుపరుస్తూ ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. డీఎం మల్లేశయ్య, మెకానికల్ ఇంజనీరు దశరథ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సంగారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ ఆర్ఎం విజయభాస్కర్ అన్నారు. మంగళవారం సంగారెడ్డి ఆర్టీసీ డిపోపరిధిలో నాటేకార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఉద్యోగులు సమష్టి కృషితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉపేందర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



రైతుబజార్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం,(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని కార్పొరేటర్ సింధురెడ్డి అన్నారు. మంగళవారం బొంబాయి కాలనీ, మాక్స్ సొసైటీ, విద్యుత్‌నగర్ కాలనీలో జలమండలి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. బొంబాయి కాలనీలో నిర్మాణ దశలో ఉన్న రైతుబజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్లకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శివకృష్ణ, ఇంజనీరింగ్ శాఖ డీఈ దేవేందర్, ఏఈ ఫైసల్ పాల్గొన్నారు.

కులమతాల ఘర్షణలకు పాల్పడితే చర్యలే

సీఐ నయీముద్దీన్



జిన్నారం (పటాన్‌చెరు): శాంతిభద్రలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిన్నారం సీఐ నయీముద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిన్నారం పోలీస్ సర్కిల్ పరిధిలోని పవిత్ర గుడులు, మసీదులు, చర్చీలు వద్ద అత్యాధునిక సామర్థ్యం కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వాటి బాధ్యత ఆయా సంఘాల నాయకులు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరు ఆయా మత సంప్రదాయాలను గౌరవించాలని తమ సామర్థ్యంతో స్నేహభావం కలిగి ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో నిజనిజాలు తెలుసుకోకుండా కుల మత ,విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో 15 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో అంతర్గత రోడ్లు, మురుగుకాల్వలు, ఖాళీ స్థలాల్లో పొదలు, మురుగు, వరదనీరు నిలవడం, వరద, మురుగు నీరు రోడ్లపై పారడం, బైపాస్ రోడ్లు పాడవ్వడం తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ వివరించారు. ఆయా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు పట్నం మాణిక్, సుగుణాకర్, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాలమురళీకృష్ణ



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరుకు చెందిన బాల మురళీకృష్ణ (చిన్న ముదిరాజ్‌ను) పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన పదవి రావడానికి సహకరించిన సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 16మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధిఖీ ఏడుగురికి రూ.1500, మిగతా తొమ్మిది మందికి రూ.1000 చొప్పున జరి మానా విధించినట్లు ట్రాఫిక్‌పోలీస్‌లు పేర్కొన్నారు.

◆ నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

జహీరాబాద్: విద్యుత్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ కామేష్ హెచ్చరించారు. మంగళవారం జహీరాబాద్‌లో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. చిన్నచిన్న అవాంతరాలు ఏర్పడితే తక్షణమే స్పందించి నివారించాలని సూచించారు. సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డీఈ లక్ష్మీనారాయణ, ఏడీఈలు మధుసూదన్, రజనీకాంత్, ఏఈలు, లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

ఆర్ఏఎఫ్‌సీ కంపెనీ టీమ్ పరిశీలన

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రహదారులను మంగళవారం హకింపేట 99ఆర్ఏఎఫ్‌సీ కంపెనీ టీమ్ పరిశీలించారు. సున్నితమైన గ్రామాలు పట్టణాలను సందర్శించి వివరాలు తెసుకునేందుకు వచ్చామన్నారు. పట్టణ పోలీసులు 99 ఆర్ఏఎఫ్‌సి కంపెనీ టీమ్‌ను పట్టణంలోని ప్రధాన రహదారులు ప్రభుత్వ కార్యాలయలను పరిశీలించేందుకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో 99 ఆర్ఏఎఫ్‌సీ కంపెనీ టీమ్, ఎస్ఐ కృష్ణాగౌడ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

◆ వరుసక్రమంలో వార్డులను విభజించండి

జిన్నారం(పటాన్‌చెరు): నూతనంగా ఏర్పడిన గడ్డపోతారం మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల విభజనపై అభ్యంతరాల స్వీకరణ సమావేశం కమిషనర్ జైత్రంనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. మున్సిపాలిటీలో 18 వార్డుగా విభజిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గడ్డపోతారంలో 1,2,3,4,14,15 వార్డులు, ఖాజిపల్లిలో 5,6,7,8,9 వార్డులు, మాదారంలో 10,11,12,13 వార్డులు, వావిలాలలో 16,17 వార్డులు, లక్ష్మీపతిగూడెంలో 18 వార్డులుగా ఉండగా గడ్డపోతారం నాయకులు తమకు కేటాయించిన 6 వార్డులు వరుసక్రమంలో లేకపోవడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. 6 వార్డులు వరుసగా ఉండేలా విభజించాలని విజ్ఞప్తి చేశారు.

◆ కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెలంగాణ మంత్రి వర్గంలో బహుజనులకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ మహేష్‌గౌడ్ చిత్రపటాలకు మంగళవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లోని కార్యాలయంలో జిల్లాల ఎన్ఎంఆర్ యువసేన సోషల్ మీడియా ప్రతినిధులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు.

◆ పాఠ్యపుస్తకాల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మండలంలో 44 పీఎస్‌లు, 13 యూపీఎస్‌లు, 8జెడ్పీహెచ్‌సీలు, ఒక కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 4300 మంది విద్యార్థులు చదువుతున్నారు. జూన్ 1 నుంచి ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చిన పాఠ్యపుస్తకాలను తీసుకువెళ్తున్నారు. ఒకటి రెండు మినహా అన్ని పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు.